ప్రజాశక్తి
శుక్రవారం 23 ఆగస్టు 2024
5
కర్నూలు

సెప్టెంబర్ 11 నుంచి ఇసుక కొత్త పాలసీ

- జిల్లాలో కొత్తగా 5 ఇసుక రీచ్ పాయింట్లు
- స్వర్ణ గ్రామ అల్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం - కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సెప్టెంబర్ 11 నుండి కొత్త ఇసుక పాలసీనీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ప్రకటించారు. ప్రజలు నేరుగా ఇసుక తీసుకోవచ్చు కానీ అక్కడినుండి రవాణా కోసం వాహనాలకు చార్జీలను మాత్రమే వసూలు చేయడం జరుగుతుందని వెల్లడించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

జిల్లాలో మొత్తం 484 గ్రామపంచాయతీలలో నాలుగు అంశాలతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్‌పి బిందు మాధవతో కలిసి జిల్లా కలెక్టర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు జిల్లాలో ప్రస్తుతానికి గుడికంబాళీ ఇసుక పాయింటు నుండి ఇసుక సరఫరా చేస్తున్నామన్నారు. వచ్చేవారం నుండి కూడా సి.బెళగల్‌లో కూడా ఇసుక పాయింటు ద్వారా ఇసుకను సరఫరా చేస్తామన్నారు. ఇక్కడ 4 వేల టన్నులకు పైగా ఇసుక అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో కొత్తగా ఐదు ఇసుక రీచ్ పాయింట్లను గుర్తించామని పేర్కొన్నారు. అన్ని అనుమతులు రాగానే ఇక్కడి నుండి కూడా ఇసుక రవాణాకు అనుమతిస్తామన్నారు. జిల్లాలో ఎవరైనా ఇసుక సరఫరాకు సంబంధించి ఫిర్యాదు చేయాలనుకుంటే టోల్ ఫ్రీ నెంబర్18004256942 నంబరుకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

కొత్తగా ఓటర్ల నమోదుకు దరఖాస్తు

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా కొత్తగా ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే బిఎల్‌ఒలు ఇంటింటికి వెళ్లి సర్వే కూడా చేపడుతున్నారని అన్నారు. ఓటరు జాబితాలో ఎవరైనా ఓటర్లు తమ వివరాల సవరణతో పాటు కొత్త ఓటర్గా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి సాగు ఇక్కడ లేదన్నారు. విద్యార్థులకు కూడా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి బాటలు పడేనా..?

- నేడు పంచాయతీల్లో గ్రామ సభలు - నాలుగు అంశాలతో సభలు - కేరళ తరహా గ్రామ పాలనకు ప్రభుత్వం శ్రీకారం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీల్లో స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నారు. నాలుగు అంశాలతో ఈ సభలను నిర్వహించనున్నారు. పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కేరళ తరహా గ్రామ పాలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రామ పంచాతీల అభివృద్ధికి బాటలు పడేనా అనే ఆశలు జిల్లా వాసుల నుంచి వ్యక్తం అవుతోంది...

రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో గ్రామ సభలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 482 గ్రామ పంచాయితీలు ఉండగా శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లోనూ గ్రామ సభలను నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న గ్రామసభలను విజయవంతం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ప్రధానంగా నాలుగు అంశాలపై ఈ గ్రామ సభలను నిర్వహించనున్నారు. వాటితో పాటు గ్రామ సభలలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పనులను విస్తృతంగా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న రీతిలో శ్రీకారం చుట్టింది. ఒకే రోజు రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ సభలో నిర్వహించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కేరళ తరహా పాలనను గ్రామ స్థాయి నుండి ప్రారంభించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా కనపడుతోంది. గతంలో రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నపుడు ప్రజా పాలన పేరుతో మూడు రోజుల పాటు గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలు అప్పట్లోనే కేరళలోనే విజయవంతం అయినట్లు తెలుస్తోంది.. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం ఏపీలో ఏర్పాటు అయ్యాక గ్రామ సభలు జరపాలని నిర్ణయం తీసుకోవడం పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఆ గ్రామ సర్పంచి ఆధ్వర్యంలో ఈ గ్రామ సభలు జరుగనున్నాయి. ఈ సభలో ప్రజల భాగస్వామ్యం చేసి వారి ద్వారా గ్రామాల అభివృద్ధికి ఏ ఏ అంశాలు అవసరమో వాటిని గ్రామ సభల ద్వారా ఆమోదింపజేసి ప్రతిపాదనలు పంపనున్నారు. వాటికి నిధులను కేటాయించి తద్వారా పనులను చేపట్టనున్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం పనులు, ప్రతి కుటుంబానికి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, గ్రామాల్లో అవసమైన చోట్ల సీసీ రోడ్లు ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అవసరమైన ఉద్యాన పంటల సాగుకు చర్యలు, పశు సంపద కలిగిన రైతులకు మినీ గోకులాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ గ్రామ సభలో తీర్మానం చేయనున్నారు. వీటితో వాటు గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులు చేపట్టేలా గ్రామ సభలు దోహద పడనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ గ్రామసభల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో పాటు ఎంపిడిఓలు, ఏపీడీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొంటుండగా గ్రామ సభలు విజయవంతం అయ్యేందుకు, సభలను పరిశీలించేందుకు మండల స్థాయిలో మండల ప్రత్యేకాధికారి, గ్రామస్థాయిలో ప్రత్యేకాధికారులను నియమించారు. ఈ గ్రామ సభలో జిల్లా మంత్రులు, జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, ఆర్‌డివోలు తహశీల్దారులు పాల్గొననున్నారు. ఈ గ్రామ సభల్లో ప్రజల భాగస్వామ్యంతో నిర్ణయాలు, తీర్మానాలు చేస్తారా.. లేక అధికార పార్టీకి చెందిన చోటా మోటా నాయకుల అభిప్రాయం మేరకు నిర్ణయాలు జరుగుతాయా అన్నది వేచి చూడాల్సిందే.

ప్రణాళికల రూపకల్పన

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉన్న 426 గ్రామ పంచాయతీల్లో స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో నాలుగు అంశాలతో గ్రామ సభలు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గ్రామ సభల నిర్వహణకు ఇప్పటికే ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. హౌస్ హోల్డ్ ఎసెన్షియల్స్, రోడ్ కనెక్టివిటీ, భవిష్యత్ ప్లానింగ్ అంశాలపై ఈ గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఆ మేరకు గ్రామ, మండల, జిల్లా ప్రణాళికలు రూపొందిస్తామని కలెక్టర్ వివరించారు. అవసరాన్ని బట్టి హాస్టల్, కెజిబివి, గురుకులం అందుబాటులో ఉండే విధంగా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని, వచ్చే ఏడాది వీటిని ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మొక్కలు నాటుతున్న కలెక్టర్ రంజిత్ బాష

తల్లి పేరుతో మొక్క నాటండి

- కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. గురువారం తల్లి పేరుతో మొక్క కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తన తల్లి పేరుతో మామిడి మొక్కను నాటారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలోనూ, వీలైన ప్రదేశాలలో ప్రతి ఒక్కరూ వారి తల్లుల పేరు మీద మొక్కలను నాటాలని పిలుపు నిచ్చారు. మొక్కలు నాటిన అనంతరం సంబంధిత ఫోటోలు మేరీ లైఫ్ పోర్టల్ లో అప్లోడ్ చేసేందుకు కూడా అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకలాపాలన్నీ క్యాంప్ కార్యాలయంలోనే...

- అక్కడికే పరిమితమైన కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ కార్యాలయాన్ని వదిలి క్యాంప్ కార్యాలయంలోనే తిష్ట వేసి అన్ని కార్యకలాపాలు అక్కడి నుండే నిర్వహిస్తున్నట్లు సమాచారం. అందుకు గల కారణం కార్యాలయానికి వచ్చినట్లయితే ఇటు వైసిపి అటు టిడిపి కార్పొరేటర్లు వచ్చి తమ పనులు చేయాలంటే తమ పనులు చేయాలంటూ ఒత్తిడి చేయడంతో కార్యాలయానికి రావడం మానేసి క్యాంప్ కార్యాలయంలోనే కార్యాలయం సంబంధించిన దస్త్రాలపై సంతకాలు చేయడం లాంటి పనులన్నీ అక్కడే నిర్వహిస్తున్నారు. విసీలు, సమీక్షా సమావేశాలు, లాంటివి ఉన్నట్లయితే సుంకేసుల రోడ్‌లోని కొత్త కౌన్సిల్ హాల్ లో నిర్వహిస్తున్నారు. కమిషనర్ కార్యాలయానికి రాకపోవడంతో ఇతర శాఖల అధికారు లు కూడా తమకు వచ్చినప్పుడు వచ్చి వెళ్తున్నారు. జనన, మరణ విభాగం అధికారులు మాత్రమే తప్పక హాజరవుతున్నారు. కమిషనర్‌గా కొత్తగా విద్యాధరిని ప్రభుత్వం శనివారం నియమించిన ఇంతవరకు ఆమె చేరాకపోవడంతో రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ ఐఎఎస్ లు కార్పొరేషన్‌లో కమిషనర్లుగా వస్తే మా పనులు సక్రమంగా సాగవని, నాన్ ఐఎఎస్ కావాలని కోరినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. కమిషనర్, అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్ల పనులన్నీ ఒకే వ్యక్తి చేయాల్సిన పరిస్థితి ఉండటంతో పని ఒత్తిడి పెరిగిపోయి మానసికంగా ఇబ్బందికి గురవుతున్నారు. ఇలా ఉండడం చేత ఏ ఒక్క పోస్టుకు న్యాయం చేయలేని పరిస్థితి ఉంది. నగరంలో ఆదాయాన్ని సమకూర్చే రెవెన్యూ శాఖలో వసూళ్లు కూడా తగ్గిపోయాయి. ఇతను కూడా ఒత్తిడికి తట్టుకోలేక సెలవులపై వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నగరపాలక సంస్థలో మరొక కీలకమైన పోస్ట్ సిటీ ప్లానర్ పోస్ట్ కూడా ఖాళీగా ఉండడం చేత ఇన్చార్జిగా డిసిపి సంధ్యను ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో నగరంలోని బిల్డింగ్ అనుమతులు నత్తనడకన సాగుతున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తట్టుకోలేక ప్రజారోగ్య అధికారి కూడా పరిస్థితి పనులపై దృష్టి సారించలేకపోతున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు అతను కూడా ఒక్కోసారి ఇలా చేస్తే మా పనులు ఎలా సజావుగా సాగుతాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు కూడా తలనొప్పిగా మారాయి. వెంటనే ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకొని కమిషనర్ వచ్చి జాయిన్ అయ్యేటట్లు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే నగరపాలక సంస్థ కార్యకలాపాలన్నిగాడిన పడతాయి.

రేషన్ బియ్యం పక్కదారి...

- ఎండియు వాహనాలు, రేషన్ డీలర్ల ద్వారానే తంతు
- మాఫియాకు అధికార యంత్రాంగం అండదండలు
- నామమాత్రంగా తనిఖీలు, దాడులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో రేషన్ బియ్యం యథేచ్ఛగా పక్కదారి పడుతోంది. రేషన్ బియ్యం పెద్ద ఎత్తున అక్రమంగా తరలిపోతున్నా పౌరసరఫరాలు, రెవెన్యూ, విజిలెన్స్, పోలీస్ యంత్రాంగాలు తూతూ మంత్రంగానే తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నాయి. ఎక్కడ పెద్ద ఎత్తున వాహనాలను పట్టుకుని సీజ్ చేయడం లేదు. రేషన్ బియ్యం అక్రమ దారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఇటీవల రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వ్యాఖ్యలు చేశారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకుని వెంటనే 6ఎ కేసులను నమోదు చేస్తామని పేర్కొన్నారు. అయినప్పటికీ జిల్లాలో రేషన్ బియ్యం పెద్ద ఎత్తున ప్రతినెల లారీల కొద్దీ పక్కదారి పడుతోంది. ఈ అవినీతి తంతు అన్ని అధికార శాఖల అండదండలతోనే సాగుతోందని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కర్నూలు జిల్లాలో మొత్తం 1228 రేషన్ షాపులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 6,76,209 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డులోని ఒక వ్యక్తికి ఐదు కిలోల చొప్పున బియ్యం అందజేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా రేషన్ బియ్యం పంపిణీకి 11 వేల టన్నులు సరఫరా అవుతుంది. ఇక్కడి నుండి రేషన్ బియ్యాన్ని రేషన్ మాఫియా వాహనాల ద్వారా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని రైస్ మిల్లులకు పంపుతున్నారు. అక్కడ ఈ రేషన్ బియ్యం పాలిషింగ్ చేసి సన్నబియంగా మార్కెట్లోకి తయారు చేసి పంపుతారు. రేషన్ బియ్యం మాఫియా చేపడుతున్న దందా చూస్తే ఆశ్చర్యం కలగక మానదు.

ఎండియు వాహనాల్లోనే పక్కదారి

ఇంటింటికి రేషన్ బండ్ల పంపిణీలో భాగంగా రేషన్ బియ్యం వాహనాల ద్వారా ప్రతినెల కార్డుదారులకు అందజేస్తున్నారు. ఇక్కడ వాహనాల్లో ఆపరేటర్లు, రేషన్ డీలర్లు కుమ్మక్కై కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇచ్చేసి బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఈ వ్యవహారం జిల్లా వ్యాప్తంగా అన్ని ఎండియు వాహనాల్లో కొనసాగుతుంది. ఇక్కడి నుండి సేకరించిన బియ్యాన్ని నేరుగా రేషన్ మాఫియాకు ముట్టజెబుతారు. ఈ వ్యవహారంలో పౌర సరఫరాల శాఖకు చెందిన అధికారులు, మండల స్థాయిలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పెద్ద ఎత్తున మామూళ్లు తీసుకుంటూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎంఎల్ఎస్ పాయింట్‌లలో

పౌరసరఫరాల కార్పొరేషన్ సంబంధించిన ఎంఎల్ఎస్ గోడౌన్ పాయింట్లలో కూడా అక్రమ దందా కొనసాగుతుంది. ఇక్కడ ఉన్న ఇన్చార్జి అధికారి రేషన్ బియ్యం మాఫియాతో కుమ్మక్కై లారీలకు లారీలు బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. ఈ వ్యవహారంలో సదరు కార్పొరేషన్ ఉన్నత అధికారి నుండి క్షేత్రస్థాయి అధికారి వరకు రేషన్ మాఫియా పెద్ద మొత్తంలో లంచాలను ముట్టజెబుతున్నారు.

రేషన్ మాఫియాకు సహకరిస్తున్నది అధికారులే

కర్నూలు నగర కేంద్రంగా ఉన్న రేషన్ మాఫియాకు ఇక్కడ ఉన్న పోలీసు, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పౌర సరఫరాల, రెవెన్యూ అధికారుల అండదండలు ఉన్నాయి. ప్రతి నెలా రేషన్ మాఫియా పెద్ద ఎత్తున మాముళ్లను పంపిస్తున్నారు. రేషన్ మాఫియాకు సంబంధించిన వాహనాలను ఎక్కడ పట్టుకోకుండా, దాడులు జరగకుండా సదరు శాఖలకు చెందిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ వాహనాలు పట్టుకుంటే వెంటనే వారికి పెద్ద ఎత్తున మాఫియా ఆఫర్ ఇస్తుంది. ఆ ఆఫర్లు అంగీకరిస్తే వెంటనే ఆ వాహనాలను ఎక్కడా ఆపకుండా పంపిస్తుంటారు.

సెబి చీఫ్ వెంటనే రాజీనామా చేయాలి

డిసిసి అధ్యక్షుడు కె బాబురావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సెబి చీఫ్ మాధురి పురి బచ్ వెంటనే రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.బాబురావు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని నగరంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు బాబురావు పాల్గొని మాట్లాడుతూ సెబీచీఫ్ మాధబి పురిబచ్‌కు ఆదాని గ్రూప్ సంస్థల వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం జెపిసి వేయాలన్నారు. దేశంలో జరుగుతున్న అతి పెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణం పై వినూత్నంగా చర్చ జరగాలన్నారు. ఆదాని సెబీ సంబంధాలపై హిండేన్ బర్గ్ నివేదికలో వెల్లడించిన అంశాలపై విచారణ జరపాలన్నారు. ఫైనాన్షియల్ మార్కెట్లను నియంత్రించాల్సిన సెబీ రాజీ పడటం ఈ కుంభకోణంలో ప్రధాన మంత్రి పాత్ర పూర్తిగా ఉందని సెబి చైర్ పర్సన్‌ను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ అనేక దేశాల పర్యటనలకు వెళ్లాడని, వాటికి సంబంధించిన ఖర్చులు అధికారికంగా శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు షేక్ జిలానిబాష, జి.రమేష్ యాదవ్ , రామాంజనేయులు కోఆర్డినేషన్ చైర్మన్ అనంతరత్నం, డిసిసి ఉపాధ్యక్షులు బి.బతుకన్న, దిలీప్ దోక, డిసిసి ప్రధాన కార్యదర్శులు సయ్యద్ నవీద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్ ప్రమీల పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మట్టిమిద్దెలు

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి పట్టణంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి రెండు మట్టి మిద్దెలు కూలిపోయాయి. 7 వ వార్డులో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులందరూ బయట గదిలో నిద్రిస్తుండగా వంటగది కూలిపోయింది. అదేవిధంగా 13వ వార్డు రైల్వే స్టేషన్ వీధిలో ఇబ్రహీం కుటుంబం బయట గదిలో నిద్రిస్తుండగా లోపల గది కూలిపోయింది. ఈ రెండు కుటుంబాలు బయట నిద్రిస్తుండడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంటిలోని వంట సామాగ్రి, ధాన్యం మొత్తం నానిపోయాయని, ఒక్కో కుటుంబానికి రూ. రెండు లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పేద ,దళిత రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలి

డ్వామా పిడికి సిపిఎం ప్రతినిధి బృందం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే గ్రామ సభల్లో ఉపాధి హామీ పథకం కింద పేద ,దళిత రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డికి సిపిఎం ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. డి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ, కెవి.నారాయణ, ఓర్వకల్లు మండల కార్యదర్శి బి.నాగన్న కలిసి వినతిపత్రం అందజేశారు. డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఉపాధిహామీ కింద గతంలో 241 రకాల పనులను గ్రామాల్లో గుర్తించి చేసేవారన్నారు. కేవలం ఇప్పుడు 36 రకాల పనులను చేస్తున్నారన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభలలో ఉపాధి హామీ పనులు గుర్తింపులో ప్రధానంగా చెరువులు , కుంటల పూడికతీత పనులతో పాటు అసైన్డ్ భూములను అభివృద్ధి చేసే పనులను గుర్తించాలన్నారు. చిన్న, సన్నకారు రైతుల పంట పొలాల రాళ్లు తొలగించడం పొలంగట్లు వేయడం రహదారులను వేయడం పనులను గుర్తించాలన్నారు. ఫారం పండ్ పనులతో పాటు స్మశాన వాటికలను అభివృద్ధి చేసే పనులను చేసేలా చూడాలన్నారు. గ్రామాల్లో మౌలిక వస్తువుల కల్పన వంటి పనులను కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు.



డ్వామా పిడి అమర్‌నాథ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం ప్రతినిధి బృందం

మొక్కలు నాటుతున్న అధికారులు , విద్యాకమిటీ చైర్మన్లు

4వేల మొక్కలు నాటిన అధికారులు, చైర్మన్లు

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని అన్నీ పాఠశాలల్లో అధికారులు ఎంపిడిఓ రాముడు, ఎపిడి అలీపీరా, ఇసి పృధ్వి, ఎపిఒ లక్ష్మన్, మండలంలోని విద్యాకమిటీ చైర్మన్లు సుమారు నాలుగు వేల మొక్కలను నాటారు. గురువారం మండలంలో ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో చేపట్టాలని యంత్రాంగం సుమారు నాలుగు వేల మొక్కలను మంజూరు చేయించారు. ఇక్కడే మొక్కలు నాటించిన అనంతరం సంరక్షణలో మెలకువలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రామాంజనేయులు చైర్మన్లు డిష్ వెంకటేష్, చంద్ర, నరసింహులు, తిప్పన్న, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం

బాధితులకు వీల్ చైర్స్, మెడ, నడుము పట్టీలు, చేతి కర్రలు పంపిణీ
ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ జి సుధాకర్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

ఫ్లోరైడ్ వినియోగం వల్ల ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందని దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ జి.సుధాకర్ అన్నారు. గురువారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పుసులూరు గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనంలో ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న బాధితులకు చేతి కర్రలు, మెడ పట్టీలు, నడుము పట్టీలు, వీల్ చైర్స్ ఫ్లోరోసిస్ ప్రోగ్రాం తరపున డాక్టర్. శైలేశ్ కుమార్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ అందజేశారు. రేమడూరు గ్రామంలోని మండల ప్రాథమిక పరిషత్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వలన వచ్చు అనర్థాల గురించి విద్యార్థులకు తెలిపారు. పొగాకు ఉత్పత్తులలో ఎన్నో విషపదార్థాలు ఉంటాయని సరదాగా మొదలయ్యే ఈ అలవాటు తరువాత వ్యసనంగా మారి ప్రాణాలు తీస్తోందన్నారు. ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నిల్వ చేసిన జంక్ ఫుడ్ తినడం వలన ఆరోగ్య సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. హై ఫ్లోరైడ్ టూత్ పేస్ట్ , నిల్వ ఉండే చిరు తిళ్లు, శీతల పానీయాలు, రెడీమేడ్ చిప్స్, ప్యాకేజెడ్ ఆహార పదార్థాలలో అధికంగా ఫ్లోరైడ్ ఉంటుందన్నారు. ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఫ్లోరోసిస్ అనే వ్యాధి రెండు రకాలుగా యేర్పడుతుందని, మొదటిది దంతాలకు సంబంధించినది దంతాల మీద అడ్డంగా పసుపు రంగు గీతాలు యేర్పడు తాయని, చాక్ పీసు రంగులోకి మారి, దంతాలు గుంటలు గుంటలుగా యేర్పడి దంతాలు పిప్పి పళ్లుగా తయారవుతాయని తెలిపారు. మనం తినే ఆహారం సరిగా నమలలేక పోతారని, దీని వలన తల నొప్పి రావడం, దంతాలకు రంధ్రాలు పడటం వలన సరైన పోషకాహారం తీసుకోలేరన్నారు. దీనివలన పోషకాహారలేమికి , అనేక వ్యాధులకు గురవుతారని తెలిపారు. ఆరోగ్యకార్యకర్త శశికళ, ఆశాకార్యకర్త మహబూబ్ బి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రంగన్న , ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ జిల్లాస్టోర్స్ వద్ద నిరసన తెలపుతున్న కార్మికులు

లోడింగ్, అన్ లోడింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్తు రంగంలో మూడు దశాబ్దాల పైబడి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్టోర్స్‌లో లోడింగ్ అన్ లోడింగ్ కార్మికులకు పని ఇవ్వకుండా బయటి వారికి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని అన్ని జిల్లాల్లో విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. అందులో భాగంగా గురువారం కర్నూలు నగరంలోని విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కర్నూలు నగర సిఐటియు కార్యదర్శి సి హెచ్ సాయిబాబా మాట్లాడుతూ పాత విధానాన్ని రద్దు చేస్తూ అనంతపురం జిల్లా స్టోర్‌లో బయట వ్యక్తులతో పనిచేయించడానికి టెండర్లు పిలవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మూడు దశాబ్దాలు పైబడి పనిచేస్తున్న లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులుకు కనీసం వేతనాలు ఇవ్వకుండా యాజమాన్యం అడ్డదారులు బయట వ్యక్తులతో టెండర్ల పిలవడం సిగ్గుచేటని తెలిపారు. తక్షణమే బయట వ్యక్తులతో టెండర్లు వేయిస్తే రాష్ట్ర వ్యాప్తంగా అడ్డుకుంటామని తెలిపారు. అనంతపురం జిల్లాలో ఇచ్చిన టెండర్స్‌ను తక్షణమే రద్దు చేయకపోతే ఉద్యమం మరింత ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఎస్‌పిడి సిఎల్ కమిటీ ఉపాధ్యక్షులు, పి.నాగరాజు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు మోహన్, చలపతి, విజయకుమార్, చంద్రశేఖర్, రామిరెడ్డి, భీసన్న, సుధాకర్, సురేష్, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అభియాన్‌తో అభివృద్ధి

ప్రజాశక్తి-మద్దికేర

వైద్య, ఐసిడిఎస్, సిబ్బంది సమన్వయంతో సంపూర్ణ అభియాన్ ద్వారా సంపూర్ణ అభివృద్ధి సాధించవచ్చని నీతి అయోగ్ అధికారి అఖిల తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ ఆఫీస్‌లో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పిరేషన్ ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ మద్దికేర మండలాన్ని నీతిఅయోగ్ ఆకాంక్షల ప్రాంతంగా గుర్తించిందన్నారు. మండలంలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమం ద్వారా వైద్య ఐసిడిఎస్ రంగాల్లో ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో గర్భిణీలకు పూర్తిస్థాయిలో అందిస్తున్న సేవలను డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. గర్భిణీలకు పిల్లలకు ఐసిడిఎస్ ద్వారా సంపూర్ణ పోషణ సరుకులను తగిన సమయంలో అందించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి సూచించారు. వైద్య ఐసిడిఎస్ అధికారులను ఎంపిడిఒ నరసింహా మూర్తి సమీక్ష చేశారు. సంపూర్ణ అభియాన్‌లో సంబంధిత అధికారులు తమ సేవలను పారదర్శకంగా చేయాలని సూచించారు. ఎంపిడిఒ నరసింహా మూర్తి, అంగన్వాడీలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

గుమ్మనూరు రైల్వే వంతెన కిందికి భారీగా వరద నీరు

- రాకపోకలకు అంతరాయం - ఇబ్బందులు పడుతున్న రైతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

వరద నీరు చేరడంతో ఇబ్బంది పడుతున్న రైతులు

చిప్పగిరి నుంచి బంటనహాల్ మీదుగా గుమ్మనూరుకు వెళ్లే రహదారిలో ఉన్న గుమ్మనూరు రైల్వే వంతెన కింద భారీగా వరద నీరు చేరింది. గురువారం వంతెనకు ఇరువైపులా ఎవరూ రాలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమంది రైతులు తమ ఎద్దులను వంతెన దాటించడానికి ఇబ్బందులకు గురయ్యారు. వంతెన మధ్యలోకి పోయి పూర్తిగా ఎద్దులు మునగడంతో మళ్లీ వెనుకకు వచ్చేసినట్లు రైతులు తెలిపారు. రైల్వే వంతెన నిర్మించే సంబంధిత రైల్వే కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేయడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని గుమ్మనూరు గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు వంతెనను పరిశీలించాలని కోరారు. గతవారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ నీటి మునగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లుతున్నారు. పంటలు సాగు చేసిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చూడాలని కోరుతున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆటో కార్మికుల నూతన కమిటీ

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. గురువారం గ్రామీణ ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వాహన మిత్ర అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఆటో కార్మికులను దృష్టిలో పెట్టుకొని పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఆటో కార్మికులకు ఇఎస్ఐ అమలు చేయాలని, 50 ఏళ్లు నిండిన ఆటో కార్మికులకు పింఛను అందజేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎంపిక : అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బి.రాముడు, అధ్యక్షులుగా బి.రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా బి.మహలింగప్ప, ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ హుస్సేన్, సహాయ కార్యదర్శిగా రాఘవేంద్ర, ఆర్థిక కార్యదర్శిగా ఎం.రాజు, కమిటీ సభ్యులుగా నరసింహులు, కేశన్న, బాష, మరో 9 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సెబి ఛైర్మన్ మాధవి రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

నిరసన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

సెబి ఛైర్మన్‌గా ఉంటూ అదాని విదేశీ సంస్థల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి కేంద్రంలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న మాధవి బుచ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా జిల్లా అధ్యక్షులు బాబు రావు అధ్యక్షతన కాంగ్రెస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న స్థాయి పెట్టుబడిదారులకు నష్టం కలిగేలా సలహా, సంప్రదింపులు జరిపి, విచారణ పేరుతో అవన్నీ ఆమె భర్తకు సంబంధించినవని మాధవి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో స్టాక్ మార్కెట్‌లో ఉన్న చిన్న స్థాయి పెట్టుబడిదారులు సైతం సెబి ఛైర్మన్‌పై విశ్వసనీయత కోల్పోయారని తెలిపారు. ప్రస్తుత అధికార పార్టీపై నమ్మకం లేనందున ఒక సంయుక్త పార్లమెంట్ కమిటీ వేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ఢోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షులు సాయినాథ్, యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, మండల అధ్యక్షులు మోహన్ రెడ్డి, శ్రీనిత్ పాల్గొన్నారు.

'నేడు మండలంలో గ్రామసభలు'

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని 20 పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఇఒఆర్‌డి నగేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. ఆయా పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణకు ఇన్‌ఛార్జీలు, మండల స్థాయి ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ శాఖల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ గ్రామ సభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జన సంద్రం.. శ్రీమఠం...

- వైభవంగా రాఘవేంద్రుని మహా రథోత్సవం
- కనువిందు చేసిన వసంతోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విశ్వ గురువుగా ప్రసిద్ధి చెందిన సద్గురు రాఘవేంద్రస్వామి మహా రథోత్సవం జన సంద్రం మధ్య వైభవంగా సాగింది. రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా గురువారం ఉత్తరారాధన సందర్భంగా రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేశారు. అనంతరం బృందావనాన్ని నవరత్న స్వర్ణ కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలతో అందంగా అలంకరించారు. స్వామి వారి పూర్వావతారమైన ప్రహ్లాద రాయులును వివిధ పుష్పాలతో అలంకరించి, అర్చించి మంగళ హారతులు ఇచ్చారు. స్వామి వారి మూర్తిని శ్రీమఠం నుంచి వేద సంస్కృత పాఠశాల వరకు పల్లకిలో ఊరేగించి పూజలు చేశారు. అక్కడి నుంచి శ్రీమఠం చేరుకున్న శ్రీప్రహ్లాద రాయలకు పీఠాధిపతులు శ్రీసుభుధేంద్ర తీర్థులు పూజలు చేశారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనం వద్ద వసంతోత్సవంలో భాగంగా ఆనందోత్సాహంతో ఒకరికొకరు రంగులు వేసుకున్నారు. అనంతరం స్వామి వారిని మహా రథంపై ఉంచి అశేష భక్త జనం మధ్య మేళతాళాలు, మంగళ వాయిధ్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. శ్రీరాఘవేంద్ర సర్కిల్ చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరిగి మహా రథోత్సవం శ్రీమఠం చేరుకుంది. రాష్ట్రపతి ప్రతిభ అవార్డు గ్రహీత, పండిత కేసరి, మహా మహోపాద్యాయ బిరుదాంకితులు రాజా ఎస్.గిరియాచార్యులు, పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్, శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాస్ రావు, వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, సహాయ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, ప్రిన్సిపల్ వాదిరాజాచార్, ద్వారపాలక అనంతాచార్, ప్రకాష్ స్వామి, ధార్మిక సిబ్బంది వ్యాసరాజాచార్, బిందు మాధవాచార్, కుర్డి జయ తీర్థాచార్, జె.ప్రహ్లాద గిరి స్వామి పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న పీఠాధిపతులు

శ్రీమఠం ఉద్యోగులకు శుభవార్త

శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శుభవార్త చెప్పారు. రాఘవేంద్రస్వామి మహా రథోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీమఠంలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు 6.6 శాతం డిఎ పెంచుతున్నామని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఇప్పుడు ఇస్తున్న జీతాలపై అదనంగా మరో రూ.2 వేలు, శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీపరిమళ విద్యానికేతన్‌లో బోధన సిబ్బందికి రూ.750, బోధనేతర సిబ్బందికి రూ.500 పెంచినట్లు చెప్పారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో అభివృద్ధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు కొనియాడారు. రాఘవేంద్రస్వామి ఆశీస్సులతో ఇరువురు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి పూజలు

రాఘవేంద్రస్వామి ఉత్తరారాధన సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. మహా రథోత్సవంలో పాల్గొన్నారు. ఆయన కుమారులు, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, ఎన్.రామ్మోహన్ రెడ్డిని పీఠాధిపతులు శ్రీసుభుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.

మంచాలమ్మను దర్శించుకుంటున్న రాఘవేంద్రరెడ్డి

శ్మశాన వాటిక భూమిని కాపాడాలి : టిడిపి

ప్రజాశక్తి - కౌతాళం

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌతాళం గ్రామానికి సంబంధించిన శ్మశాన వాటిక భూమి కబ్జా కాకుండా చూడాలని టిడిపి నాయకులు ముక్కన్న, గిరి, గొట్టయ్య, వలీ బాష, దేవేంద్ర, శ్రీరామ్ కోరారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ సత్యన్నకు వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కౌతాళం మేజర్ పంచాయితీ పరిధిలోని శ్మశాన వాటికపై సర్వే నెంబర్ 146లో 7 ఎకరాల 32 సెంట్ల భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటికలో పెరిగిన ముళ్ల చెట్లను పూర్తిగా తొలగించాలని కోరారు. సర్వేయర్ చేత సర్వే చేయించి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. దీని చుట్టుపక్కల రైతులు భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. 14 ఎకరాలున్న భూమి కేవలం 7 ఎకరాల 32 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో చూపిస్తోందని చెప్పారు. శ్మశాన వాటికలో ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు చేయించాలని కోరారు. లేకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఉరుకుంద

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మూడో గురువారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర దిగువ కాలువలో స్నానాలు ఆచరించి తడి గుడ్డలతో నైవేధ్యం వండి పూజలు చేశారు. మరి కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్, దేవాలయ సిబ్బంది భక్తులకు దర్శనం సౌకర్యాలతో పాటు నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

లోపించిన పారిశుధ్యం

పుణ్యక్షేత్రంలో పారిశుధ్యం లోపించి అనేక ప్రాంతాల్లో చెత్తాచెదారంతోపాటు దుర్గంధం వెదజల్లింది. మరికొన్ని చోట్ల నీరు నిల్వ ఉండడంతో బురదమయమై భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. వర్షాలు కురవడంతో అనేక చోట్ల నీరు నిల్వ ఉంది.

లోపించిన పారిశుధ్యం

ఉరుకుందలో ఉన్న భక్తులు

సమస్యల నిలయం.. నాగలదిన్నె...

- సమస్యలు పరిష్కరించాలి
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని నాగలదిన్నె గ్రామం సమస్యలకు నిలయంగా మారిందని, కొద్దిపాటి వర్షం కురిసినా గ్రామ వీధుల్లో నీరు నిలిచి తిరగలేని పరిస్థితి ఏర్పడుతోందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్, మండల నాయకులు ఎల్లేష్ తెలిపారు. గురువారం గ్రామంలోని వీవర్స్ కాలనీని సందర్శించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ... వీవర్స్ కాలనీ ఏర్పడి 12 ఏళ్లయిందని, ఇప్పటివరకు వీధిలో రోడ్లను నిర్మించలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజాప్రతినిధులకు తాము గుర్తుకొస్తున్నామని తెలిపారు. చిన్న వర్షం కురిసినా వీధిలో నీరు నిలిచి నడవటానికి కూడా వీల్లేనంత దుర్భర స్థితిలో వీవర్స్ కాలనీ ఉందన్నారు. మురుగునీరు నిలవడంతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలో ముళ్లకంపలు పెరగడం వల్ల విష సర్పాలు తిరుగుతున్నాయన్నారు. అనంతరం సిపిఎం నాయకులు గురుశేఖర్ మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి నాగలదిన్నె గ్రామంలోని సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర నది పక్కనే ఉన్నా గ్రామానికి తాగునీరందించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు.

గ్రామంలో పర్యటిస్తున్న నాయకులు

పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

పట్టణ ఆధునీకరణ కృషి

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణ ఆధునీకరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా వచ్చిన హేమను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే పట్టణంలోని సాయినగర్‌లో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఎఇ శరత్ చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని గాంధీ నగర్‌లో డ్రెయినేజీ పూడికతీత పనులను పర్యవేక్షించారు. ఎఇ మదన్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తహశీల్దార్ మారినా.. మారని పేరు...

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని తహశీల్దార్ కార్యాలయ అధికారుల తీరు ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అధికారులు మారుతున్నా ఏ అధికారి వచ్చారన్న సమాచారాన్ని బోర్డుపై ఉంచడం లేదు. ఆదోని తహశీల్దార్‌గా ఈనెల 3న ఆర్.శివరాముడు బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఉన్న తహశీల్దార్ హసీనా సుల్తాన్ ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. కార్యాలయం ముందు సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేశారు. గత తహశీల్దార్ హసీనా సుల్తాన్ పేరు కనిపిస్తోంది. గత తహశీల్దార్ పేరు తప్ప కొత్తగా వచ్చిన తహశీల్దార్ ఆర్.శివరాముడు పేరును ఇంకా బోర్డులో చేర్చకపోవడం అధికారుల పని తీరుకు అద్దం పడుతోంది. ఇంకా పాత అధికారే ఉన్నారా అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేయాల్సిన అధికారులు మాకెందుకులే అనుకుంటున్నారా లేక మార్చడం మర్చిపోయేంతగా పనుల్లో నిమగ్నమయ్యారా అని పట్టణ, గ్రామీణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా కార్యాలయంలో కొత్త తహశీల్దార్ పేరు చేరుస్తారా లేదా అనేది చూడాలి.

ఎస్ఐ చంద్ర బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి ఎస్ఐగా చంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నరేంద్ర కర్నూలు విఆర్‌కు బదిలీ కావడంతో జొన్నగిరి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చంద్ర ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్ర మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా నిఘా ఉంచుతామని తెలిపారు. చోరీల నియంత్రణకు, జూదం, పేకాట తదితరాల నియంత్రణపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. నాటు సారా తయారీ, అమ్మకాలు జరగకుండా గట్టి జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ... పోలీసు స్టేషన్‌లో సిబ్బంది తనకు సహకరించాలని కోరారు. అనంతరం ఎస్ఐ చంద్రను టిడిపి నాయకులు పాల్ రెడ్డి సన్మానించారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు

- సిఐ శ్రీనివాస నాయక్

ప్రజాశక్తి - ఆలూరు

వ్యసనాలకు బానిసలు కావద్దని ఆలూరు సిఐ శ్రీనివాస నాయక్, ఎస్ఐ సివి.నరసింహులు తెలిపారు. గురువారం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ ఉంచి ఉన్నత స్థాయికి చేరేందుకు కృషి చేయాలని తెలిపారు. సెల్ ఫోన్లను చదువు కోసమే ఉపయోగించాలని, సైబర్ వలలో పడవద్దని సూచించారు. కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే సమాచారం ఇవ్వాలని కోరారు. ర్యాగింగ్ కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రిన్సిపల్ కేంజుడప్ప పాల్గొన్నారు.

ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి

- ఎంటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు జంగం బసవ రాజు, భాస్కరాచారి డిమాండ్ చేశారు. గురువారం ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు మేలు చేయని 84, 117 జిఒలను రద్దు చేయాలని కోరారు. మూడేళ్ల నుంచి ప్రమోషన్లు, ఐదేళ్ల నుంచి బదిలీలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పుష్కరం క్రితం అప్‌గ్రేడైన మున్సిపల్ పాఠశాలకు, మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు ఒక్క పోస్టు కూడా మంజూరు చేయలేదన్నారు. మున్సిపల్ పాఠశాలకు పోస్టులను మంజూరు చేసి తక్షణమే ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు బడుగు బసవరాజు, చంద్రశేఖర్, ప్రతాపరెడ్డి, ఆనంద్, దస్తగిరి, నూర్ ఉల్ హక్, రమేష్ రావు, చంద్రశేఖర్ శర్మ పాల్గొన్నారు.

మొక్కలను నాటి, కాలుష్యాన్ని నివారిద్దాం

- ఎపిఒ మాధవ శంకర్, ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

మొక్కలను నాటి కాలుష్యాన్ని నివారించాలని ఎపిఒ మాధవ శంకర్, ఇఒఆర్‌డి బాలన్న సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు 'అమ్మ పేరుతో ఒక మొక్క'లో భాగంగా గురువారం నేమకల్లు, నగరడోన గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు ప్రతి ఒక్కరూ అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. కలుషితమైన గాలి పీల్చుకోవడం వల్ల అనారోగ్యాలకు గురవుతున్నారని చెప్పారు. ఈ సమస్య మరింత పెద్దది కాకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. అనంతరం మొక్కలు నాటి వాటిని పెద్దగా చేసుకుంటే కలిగే లాభాలను ఉపాధి హామీ సభ్యులకు వివరించారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు మారుతి ప్రసాద్, లక్ష్మన్న పాల్గొన్నారు. **దేవనకొండ** మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో, తెర్నేకల్ గ్రామంలో వేర్వేరుగా మొక్కలు నాటారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపిడిఒ గౌరీదేవి మొక్కలు నాటారు. ఇఒఆర్‌డి సూర్యనారాయణ, ఎఒ ఇద్రూస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీ మోహన్, ఎపిఒ కృష్ణమూర్తి, తెర్నేకల్ సర్పంచి మొగతాళ్ అరుణ్ కుమార్, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు తలారి రాముడు, రిబిక, తులసి పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని ఎరిగేరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో పాఠశాలలో 200 మొక్కలు నాటారు. టిడిపి యువ నాయకులు సతీష్ నాయుడు, సిఎంసి ఛైర్మన్ శ్రీరాములు, గ్రామ నాయకులు రామలింగ, బసవరాజు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాము, శ్రీనివాసులు, బీరప్ప, చిట్టి రాజు, అబ్దుల్ రహీం, నల్లన్న, సుధాకర్ నాయక్, లింగన్న, రంగారెడ్డి, రంగన్న, రేణుకమ్మ, రాజ్యలక్ష్మి, సుధారాణి పాల్గొన్నారు. **గోనెగండ్ల** మేజర్ పంచాయతీలో సర్పంచి పూజారి హైమావతి, మాజీ సర్పంచులు ఎస్.రహమతుల్లా, రంగముని, టిడిపి నాయకులు అడ్వకేట్ చంద్ర, వెంకటేశ్వర్లుతో కలిసి డంపు యార్డు లక్ష్మీపేట పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి సతీష్, హైస్కూల్ కమిటీ ఛైర్మన్ రాంపురం రంజాన్, మదీనా, అచ్చుగట్ల కొత్తింటి ఫక్రుద్దీన్, భారతం రహమతుల్లా పాల్గొన్నారు. **ఆలూరు** మండలం మొలగవల్లి ప్రభుత్వాస్పత్రిలో మొక్కలు నాటారు. మొలగవల్లి సర్పంచి మోహన్ రాజ్, టిడిపి మండల కన్వీనర్ అశోక్ యాదవ్, నాయకులు వెంకటేశ్వర్లు, రామంజినేయులు, బెలగంటి హనుమప్ప, మోక మల్లయ్య, ఈరన్న, యంకన్న, టెక్నికల్ అసిస్టెంట్ ఈరన్న పాల్గొన్నారు.

చిప్పగిరిలో మొక్కలను నాటుతున్న ఎపిఒ మాధవ శంకర్

ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న నాయకులు

గోనెగండ్లలో మొక్క నాటుతున్న సర్పంచి హైమావతి

ఆలూరులో మొక్కలు నాటుతున్న నాయకులు

శిథిలావస్థలో అలారుదిన్నె హంద్రీ వాగు బ్రిడ్జి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని అలారుదిన్నె హంద్రీ వాగు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. చాలా ఏళ్ల నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో బ్రిడ్జికిరువైపులా రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకొని కూలిపోయాయి. బ్రిడ్జి గోడలు బీటలు వారి రోడ్డుపై గుంతలు పడడంతో ఎప్పుడే ప్రమాదం సంభవిస్తుందోనన్న భయాందోళనలో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. కర్నూలు, బళ్లారి రహదారి మధ్యలో ఉన్న అలారుదిన్నె హంద్రీ వాగు బ్రిడ్జి బ్రిటీష్ పాలనలో 1945లో నిర్మించారు. ఓ వైపు ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసినప్పుడు వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు బ్రిడ్జిని పరిశీలించి రక్షణ గోడలు నిర్మించి, గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కూలిన రక్షణ గోడలు

ఆరాధన మహోత్సవాల్లో మైసూరు రాజవంశీయులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు కర్ణాటక రాష్ట్రం మైసూరు రాజ వంశీయులు యదువీర కృష్ణదత్త చామరాజేంద్ర ఒడియర్ హాజరయ్యారు. గురువారం శ్రీమఠం చేరుకున్న వారికి మఠం అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. ఊంజల సేవా మండపంలో మైసూరు రాజవంశీయులు యదవీర కృష్ణదత్త ఒడియర్‌ను పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు శేషవస్త్రం, శ్రీరాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి అవార్డుతో పాటు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. రాష్ట్రపతి ప్రతిభ అవార్డు గ్రహీత, పండిత కేసరి రాజా ఎస్.గిరియాచార్యులు, మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, సహాయ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, ప్రిన్సిపల్ వాదిరాజాచార్ పాల్గొన్నారు.

ఒడియర్‌ను సన్మానిస్తున్న పీఠాధిపతులు

రైళ్లు పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మీదుగా నడిచే రైళ్లు రద్దు చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, పునరుద్ధరించాలని వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ నథైడ్ ఇస్మాయిల్ కోరారు. గురువారం ఆదోని రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బెల్గాం నుంచి హైదరాబాద్‌కు నడిచే రైలు హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉండేదన్నారు. రైలును రద్దు చేయడం వల్ల హైదరాబాద్‌కు వెళ్లేందుకు, వ్యాపారులకు, ఉద్యోగులకు, సామాన్యులకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. రైలును పునరుద్ధరించాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి - కోసిగి

వర్షాకాలం కావడంతో ప్రజలు దోమల బెడదకు గురికాకుండా ఉండేందుకు ఫాగింగ్ చేస్తున్నట్లు కోసిగి మేజర్ పంచాయతీ సర్పంచి అయ్యమ్మ తెలిపారు. గురువారం కోసిగి పంచాయతీలో ఉన్న అన్ని వార్డుల్లోనూ ఫాగింగ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వర్షపు నీరు ఇంటి ముందు నిలువకుండా చూసుకోవాలని సూచించారు. నీటిని కాచి, వడబోసి తాగాలని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ తిరుమలేశ్వర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మల్లికార్జున రెడ్డి, మాణిక్య రాజు, రాజేష్ పాల్గొన్నారు.

ఫాగింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

కనబడుటలేదు.

పేరు : ఉల్లాల అరవింద్.
తండ్రి :U. నగేష్ late.
వయస్సు : 16 సంవత్సరములు.
రంగు : నలుపు., ఎత్తు: 5.5"అడుగులు.
ఆకారం : పలుచన.
తప్పిపోయిన తేదీ: 02-08-2010.
తప్పిపోయిన సమయం: ఉదయం :8-00 గంటలు.
శరీర ఆనవాళ్ళు: ఇంటి నుండి వెళ్లిన సమయంలో బ్లూ చొక్కా, నల్ల ప్యాంటు వేసుకొని ఉన్నాడు.
చిరునామా : ఇంటి నెంబర్: 27/93, చిన్న మార్కెట్, కర్నూలు.
ఈ అబ్బాయి మా ఇంటి నుండి St Joseph junior కాలేజీకి ఉదయం 8 గంటలకు వెళ్ళినాడు. అప్పటి నుండి ఇప్పటివరకు తిరిగి రాలేదు. ఎవరికైనా కనబడిన ఎడల మా చిరునామాకు ఆచూకీ తెలపగలరు.
భారతి
సెల్ నెంబర్:7095267221.

YEMMIGANUR MUNICIPALITY

e-procurement tender notice

Tender Notice No. 6/General Fund - 2024-25, dt. 22.08.2024

1.	Total of Work	1st Call -1 No
2.	Value of Work	3.16 Lakhs
3.	Bid doucment download starting date	23-08-2024 at 10.30 A.M.
4.	Bid document download end date	09-09-2024 at 3.00 P.M.
5.	Last Date & Time for receipt of Bids	09-09-2024 at 3.30 P.M.
6.	Commercial Bid opening Date	09-09-2024 at 4.00 P.M.
7.	Name & Address of the Concerned Officer	Commissioner, Yemmiganur Municipality, Yemmiganur. Ph No. 08512-255050 Fax : 08512-228050, Email: commissioner_ygr@yahoo.com

The details of name of work, Tender document, Eligibility Criteria. Bid Submission & Price Bid opening date and EMD details etc., may be seen on e-procurement market place available @ eprocurement.gov.in

Commissioner
Yemmiganur Municipality